క్లుప్తంగా

దళితుల సంక్షేమంపై దృష్టి సారించాలి

టెక్కలి: కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం దళితుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సమతా సైనిక్ దళ్ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త దేబారికి రామప్పడు, జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు డిమాండ్ చేశారు. బుధవారం టెక్కలిలో సమావేశం నిర్వహించి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. దళితుల సంక్షేమానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో ఎ.మహేష్, పి.లోకేష్, ఎల్.సత్యం, బి.నాగేశ్వరరావు, శ్రీను, రామకృష్ణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

బెంకిలిలో వరుణ యాగం



వరుణ యాగం నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని బెంకిలి పంచాయతీలో ఉమామహేశ్వర దేవాలయ ప్రాంగణంలో బుధవారం వరుణయాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు రఘునాథ్, జయరాం పాణిగ్రాహి, మధు పాణిగ్రాహి, సంతోష్ పాణిగ్రాహి, వినీత్ పాణిగ్రాహిలు వినాయక పూజ, హోమం, విరాట పర్వం అనంతరం శివలింగానికి ఘటాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రానికి వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

తోటూరమ్మకు చల్లదనం



తోటూరమ్మ తల్లి ప్రతిమ

కాశీబుగ్గ: పలాస మండలం టెక్కలిపట్నం పంచాయ తీ రేగులపాడులో తోటూరమ్మ తల్లికి బుధవారం చల్లదనోత్సవం ఘనంగా నిర్వహించా రు. తప్పెటగుళ్ల కళాకారుల గురువు పీత గంగయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా, కంబిరిగాం గ్రామంలో జయరాం చౌదరి ఆధ్వర్యంలో సంబర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ళ ప్రదర్శన ఆకట్టుకుంది.

ములాయంసింగ్‌కు భారతరత్న ఇవ్వాలి



ఎం.సర్వేశ్వరరావు

కంచిలి: సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్‌కు భారతరత్న బిరుదు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది మద్దు సర్వేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ములాయం ఇప్పటివరకు మూడుసార్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా, ఒకసారి భారత ప్రభుత్వ రక్షణశాఖ మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. సోషలిస్ట్‌గా కులమతాలకు అతీతంగా దేశ ప్రజలకు చేసిన సేవల్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారతరత్న కేటాయించాలని కోరారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



ఫైనల్ పోరులో పాల్గొన్న క్రీడాకారులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో కొన్ని రోజులుగా జరుగుతున్న ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్స్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. 'సి' జట్టు విజేతగా నిలవడంతో కెప్టెన్ సంపతిరావు జయరాం ట్రోఫీ అందుకున్నారు.

చెరువులో పూడికల తీత



చెరువు పనులు నిర్వహిస్తున్న రైతులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ ఈదుపురం రోడ్డులోని కాయ అప్పలమ్మ చెరువులో బుధవారం బెల్లుపడ రైతులు శ్రమదానం చేశారు. అందరూ కలిసికట్టుగా పేరుకుపోయిన పూడిక, చెత్తను తొలగించారు. వర్షాలకు నీరు నిల్వఉండేలా చెరువు లోతు చేశారు.

వ్యవసాయం ఏదీ?



వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు

- కొత్త ప్రభుత్వంలో రైతులకు అందని సాయం
- కేంద్రం తరఫున పీఎం కిసాన్ నిధులు మాత్రమే జమ
- గతంలో ఠంఛన్‌గా రైతు భరోసా నిధుల జమ

ఇచ్ఛాపురం రూరల్ :

కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. ఖరీఫ్‌లో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు సాయం అందకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 32 వేల ఎకరాలకు గానూ 50 శాతం మంది రైతులు ఇప్పటికే వరి విత్తనాలు వేశారు. వర్షాలు కురిస్తే మరో 50 శాతం మంది రైతులు నారుమడులు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలి విడత సాయాన్ని అందించింది. గత నెలలో రైతుల ఖాతాల్లో రూ.2వేల చొప్పున నగదు జమ అయ్యింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సాయం ఇంకా విడుదల కాకపోవడంతో పెట్టుబడి ఖర్చుల కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సకాలంలో వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించి అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ కింద రూ.6వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతులకు అందజేసింది. ఇలా రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా సాయాన్ని ఐదేళ్ల పాటు సాయం అందించింది. భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల వారు కౌలు భూములు సాగు చేస్తే వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని అందించింది. దీంతో ఎందరో పేద రైతులు లబ్ధిపొందారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంట సాగు చేశారు.

తప్పని ఎదురుచూపులు..

ప్రస్తుతం పంటల సాగు చేయడానికి రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. దుక్కులు దున్నడం, విత్తనాలు కొనుగోలు, ఎరువులకు పెట్టుబడి సాయం అవసరం. ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పెట్టుబడి సాయం రైతులకు ఎంతగానో తోడ్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే రైతులకు రూ.20వేలు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. మంత్రుల ప్రమాణ స్వీకారం, కేబినెట్ సమావేశాలు ముగిసినా రైతుల పెట్టుబడి సాయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



ఆదుకోవాలి..

గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ నాటికి రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అయ్యేది. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక పెంచిన పెట్టుబడి సాయం రూ.20వేలు అందుతుందన్న ఆశతో ప్రతి రైతూ ఉన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి రెండు వేలు మాత్రమే జమ అయ్యింది. ఇప్పటికే విత్తనాలు, ఎరువుల కోసం రైతులు అప్పులు చేశారు. ప్రభుత్వం స్పందించి అన్నదాతలను ఆదుకోవాలి.

– మానుపత్రి వీరాస్వామి రెడ్డి, రైతు, సన్యాసిపుట్టుగ, ఇచ్ఛాపురం మండలం

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: ప్రభుత్వ బాలురు వెనుకబడిన తరగతుల వసతి గృహాల్లో చదువుతున్న బాలబాలికలకు మెరుగైన సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. బుధవారం రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో ఏబీసీడబ్ల్యూఓ రఘు, ఇతర హెచ్‌డబ్ల్యూలతో ఇచ్ఛాపురం నియోజకవర్గ స్థాయి హాస్టల్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో ప్రవేశాల సంఖ్య పెంచడం, మెనూ పక్కాగా అమలు చేయడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించాని సూచించారు.

మందసలో కందిపప్పు కౌంటర్లు ప్రారంభం



పప్పు నాణ్యత పరిశీలిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్

కాశీబుగ్గ: మేజర్ పంచాయతీ మందసలోని ప్రధాన మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కందిపప్పు కౌంటర్లను పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు హోల్‌సేల్ దుకాణాలలో కందిపప్పు కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కిలో పప్పు రూ.160కే విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలుదారులకు కనిపించేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు తిరుమలబాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సేనాపతి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి పూజలు



టెక్కలిలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు



బెజ్జిపుట్టుగలో చక్రధరస్వామికి ఏకాదశి సహస్రనామార్చన సేవ

టెక్కలి: తొలి ఏకాదశి పురస్కరించుకుని టెక్కలి పాత జాతీయ రహదారిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని జగన్నాథస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.

కవిటి: కవిటి జగన్నాథస్వామి ఆలయం, లొల్లపుట్టుగ కల్యాణ వేంకటేశ్వర ఆలయం, బెజ్జిపుట్టుగలోని చక్రధర ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా దీపారాధన, సహస్రనామ సహిత తులసిపూజలు నిర్వహించారు. విష్ణుసహస్ర నామ పారాయణ చేశారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో తొలి ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని బొడ్డఖాళీ, ఈదుపురం కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కంచిలి: స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ

కంచిలి: మండలవ్యాప్తంగా తొలి ఏకాదశి పూజలు బుధవారం వైభవోపేతంగా జరిగాయి. కంచమ్మతల్లి ఆలయం ప్రాంగణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, మఠం కంచిలిలోని జగన్నాథ స్వామి ఆలయం, రాధాకృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు చామంతి దంపతులు, వైఎస్సార్ సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పీర్లపంజాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఇచ్ఛాపురం: మొహర్రం పండగ త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు. బుధవారం ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రి రోడ్డులోని పీర్లపంజా, కండ్రవీధిలోని పీర్లపంజాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొహర్రం నుంచి ఇస్లామిక్ నూతన సంవత్సరం ప్రారంభమవుతుందని, మహమ్మద్ ప్రవక్త మనవడు హసన్ హుస్సేన్ బలిదానానికి ప్రతీకగా మొహర్రం జరుపుకొంటామని చెప్పారు. కార్యక్రమంలో మతపెద్దలు ఎంఎస్‌హెచ్ రబ్బానీ, జిలానీ, అమీర్ ఆలీ, బకారి, జోహార్‌ఖాన్, షకీల్‌ఖాన్, ఆలీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భూములు కాపాడాలి

సోంపేట: రైల్వేశాఖ నుంచి తమ భూములు కాపాడాలని కొర్లాం గ్రామానికి చెందిన రైతులు బుధవారం ఎమ్మెల్యే బి.అశోక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కొర్లాం రైల్వేస్టేషన్ సమీపంలో పొలాల మీదుగా ప్రహరీ నిర్మిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు.

పాముకాటు బాధితుడికి పరామర్శ

కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 3వ వార్డు పెంటిపద్ర గిరిజన గ్రామానికి చెందిన సవర గోవిందకు బుధవారం పాముకాటువేసింది. వెంటనే బాధితుడ్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి తరలించి అత్యవసర వైద్యసేవలు అందించారు. విషయం తెలుసుకున్న పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వార్డు కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ బల్ల శ్రీనివాసరావు పరామర్శించారు. వైద్యాధికారి డాక్టర్ ఉంగ కిరణ్‌కుమార్‌తో మాట్లాడి వివరాలు అడిగితెలుసుకున్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

టెక్కలి: ఈ నెల 19న టెక్కలి మండలం భీంపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొరిగిపేట, భీంపురం, మేఘవరం, సార్లిగాం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కాశీబుగ్గ: విద్యుత్ నిర్వహణ పనుల నేపథ్యంలో బ్రాహ్మణతర్లా, కైజోల, మహాదేవపురం, టెక్కలిపట్నం, అనంతగిరి, వెంకటాపురం, కేశపురం, బంటుకొత్తూరు, కేదారిపురం, పెదంచల, చినంచల, రాజగోపాలపురం, ఈదురాపల్లి, పూర్ణభద్ర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస డివిజన్ ఈఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.



పొంచి ఉన్న ప్రమాదం

ఇచ్ఛాపురం మండలంలోని మండపల్లి రోడ్డు నుంచి బాలకృష్ణాపురం వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. తారు రోడ్డు వేసిన సమయంలో స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయి. 33 కేవీ లైన్ కావడంతో భయంతో స్థానికులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు స్పందించలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బాటసారులు, వాహనచోదకులు భయందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కూలిపోయే ప్రమాదం ఉందని, విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్



టీడీపీ నాయకుల ఆగడాలను తిప్పికొడతాం

వజ్రపుకొత్తూరు రూరల్ : అధికారాన్ని అడ్డం పెట్టుకొని గ్రామాల్లో కొందరు టీడీపీ నాయకులు చేస్తున్న ఆగడాలను తిప్పికొడతామని వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. వజ్రపుకొత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు అధ్యక్షతన పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు సీఎఫ్‌లు, రేషన్ డిపో డీలర్లను విధుల నుంచి తొలగిస్తామంటూ టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వీటిని కలిసికట్టుగా ఎదుర్కుంటామని చెప్పారు. ఈవీఎంల ట్యాంపరింగ్, ధన ప్రభావంతో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. స్థానిక సంస్థల హక్కులు, విధులకు భంగం కలిగించేలా అధికార పార్టీ నాయకులు ప్రవర్తిస్తున్న తీరు ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చలా మిగిలిపోతుందన్నారు. స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉందని, దానిని నిలబెట్టుకోవడానికి నాయకులు, కార్యకర్తలంతా సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నాయకుల మనోభావాలు సైతం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలని, నాయకులు, పార్టీ శ్రేయస్సు కోసం లీగల్ సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, వైస్ ఎంపీపీ వంక రాజు, మండల విప్ తిర్రి గుణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్, నర్తు శేషయ్య, ఇరోతు హేమంత్, వడ్డి కరుణాకర్, పీత మోహన్, సుశీల, తిర్రి కామేశ్వరి, దున్న బాలరాజు, చింతాడ హేమారావు, వెంకన్న, గొరకల రామారావు, విశ్వనాథం, జోగి అప్పారావు, గూడ ఈశ్వరరావు, తిర్రి రాజారావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంటల విధానం మేలు



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

కంచిలి: బహుళ పంటల విధానంతో రైతులకు మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ విధానం రీజనల్ కో-ఆర్డినేటర్ హేమసుందర్ అన్నారు. అంపురం యూనిట్ పరిధిలోని కత్తివరంలో పండి రాంప్రసాద్‌కు చెందిన జీడి మామిడి తోటలో బుధవారం బహుళ పంటల విధానంపై ప్రయోగాత్మక కార్యక్రమం చేపట్టారు. జీడి మామిడి తోటలో కనీసం 8 నెలలుపాటు పంటలు ఉండేలా కంది, అలసందలు, బరబాటి, గోరుచిక్కుడు, బెండ, చిక్కుడు, ముల్లంగి, గోంగూర, సజ్జలు పంటలు సాగు చేస్తే రైతుకు ఆదాయం వస్తుందన్నారు. దీంతో భూమిలో జీవవైవిధ్యం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.గోవింద్‌రెడ్డి, ఎం.టి. సూర్యనారాయణ, మండల యాంకర్ టి.శివానందం, సిబ్బంది ఎస్.కుమారి, తులసయ్య, కామరాజు, చిట్టిబాబు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

అండమాన్‌లో బొడ్డపాడు యువత సేవలు



ప్రోత్సాహకాలు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

పలాస: మండలంలోని బొడ్డపాడు గ్రామానికి చెందిన యువకులు అండమాన్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. పొట్టకూటి కోసం వలస వెళ్లి అక్కడ స్థిరపడిన బొడ్డపాడు యువకులు 1950లో జగదీశ్వర యువజన సంఘాన్ని స్థాపించుకున్నారు. ఆ రోజుల్లో బొడ్డపాడులో కమ్యూనిస్టు ప్రభావం తీవ్రంగా ఉండేది. ఆ ప్రభావంతోనే యువకులు ఈ సంఘాన్ని స్థాపించుకున్నారు. అప్పటి నుంచి వారంతా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఈ ఏడాది ప్రతిభ కనబరిచిన టెన్త్, ఇంటర్ విద్యార్థులను గుర్తించి ఘనంగా సన్మానం చేసి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు బొడ్డు కాంతారావు, మద్దిల శంకరరావు, గేదెల ధర్మారావు, పోతనపల్లి కూర్మారావు, ఎం.వెంకట్, మద్దిల రమేష్, బైనపల్లి సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు సహకరించండి



మాట్లాడుతున్న ఏఈఈ సతీష్

వజ్రపుకొత్తూరు: జల్‌జీవన మిషన్ ద్వారా చేపడుతున్న ఇంటింటికీ కుళాయి నిర్మించే పనుల్లో భాగంగా ప్రజలకు ఇబ్బందుల లేకుండా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ సతీష్ అన్నారు. బుధవారం కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేటలో పైప్‌లైన్ ఏర్పాటు చేసే వీధులను పరిశీలించారు. సుమారు రూ.23 లక్షలతో ఏర్పాటు చేయనున్న పనుల వల్ల కొన్నిచోట్ల సిమెంట్ కట్టడాలు, గడపలు, ఇతర చిన్నచిన్న కట్టడాలు తొలగించాల్సి ఉంటుందని, అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి శ్రీను, మాజీ సర్పంచ్ గోవింద పాపారావు, ఎంపీటీసీ సభ్యుడు గుంటు మాకయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.